## పేషెంట్ చెప్పే కథలు



# రాజీ

డాక్టర్
ఆలూరి విజయలక్ష్మి

"ఈ యిల్లంటే నాకు అసహ్యం. యిందులో బతుకుతున్న మనుషులంటే నాకు పరమ రోత. ఈ యింటికి, ఈ మనుషులకు దూరంగా పారిపోతాను. నా కంఠంలో ఊపిరుండగా మళ్ళీ ఈ గడపతొక్కను" చేతిలోవున్న టిఫిన్‌బాక్స్‌ని టేబిల్ మీదకు విసిరేసి, కళ్ళు తుడుచుకుని, వానిటీబాగ్ తీసుకుని విసవిసా గుమ్మం దాటింది సుచరిత. పైన సెగలు పొగలు కక్కుతున్న సూరీడు కంటే ఎక్కువగా మండిపోతూంవామె హృదయం.

ఒక్కసారా, రెండుసార్లా— ప్రతి నాలుగు రోజులకు తల్లిదండ్రు లిద్దరూ బద్ధశత్రువుల్లా తన మీద విరుచుకుపడుతూంటే ఎదుర్కోవడానికి తనకు శక్తి చాలడంలేదు. తను ఎదురు తిరిగి పోట్లాడలేదని మాటకు జవాబు చెప్పలేదని వాళ్ళకు బాగా తెలుసు. ఆ అలుసు చూసుకునే వాళ్ళిలా తన మీదకు దండెత్తి వస్తున్నారు. ఆవేశంలో సుచరిత పెదాలు వణుకుతున్నాయి. రోషంతో ఎర్రబడ్డాయామె కళ్ళు! లోలోపల లావాలా వుడుకుతున్న వుద్రేకం, తలలోని నరాలు చిట్లిపోతున్న భావన, నెత్తిమీద ఎవరో సుత్తితో మోదుతున్నంత బాధ. కళ్ళు మసకబారి తూలు వచ్చినట్లయింది. ఆఫీసుకు వెళ్ళడానికి బస్ కోసం ఎదురుచూస్తున్న సుచరిత రిక్షా ఎక్కి శ్రుతి నర్సింగ్ హోమ్‌కి వచ్చింది.

"నీ తలనొప్పిని మాత్రం నేను తగ్గించలేకపోతున్నానమ్మా! నీకసం తప్పులే లేదా కనిపించడంలేదు. నీ బాధ చూడలేకే ఎందుకైనా మంచిదని అన్ని టెస్ట్సు చేయించాను. రిపోర్ట్సు అన్నీ నార్మల్‌గా వున్నాయి." సాలోచనగా చూస్తూ అంది శ్రుతి. మౌనంగా కళ్ళు దించుకుని కూర్చుంది సుచరిత.

"ఎన్నిసార్లు చెప్పినా శుభ్రంగా తిండి తింటున్నట్లు కనపడవు. ఎప్పుడూ ఏదో కొండంత బాధ ననుభవిస్తున్నట్లు వుంటావు. నీ బాధనూ, సమస్యల్నీ ఎవరితోనూ చెప్పుకోకుండా నీలోను వుక్కి కుమిలిపోతూంటే నీలోని టెన్షన్ బయటికి వచ్చే దారిలేకపోతే కూడా యిలా విపరీతమైన తలనొప్పి వస్తుంది" అనునయంగా చెప్పసాగింది శ్రుతి.

"నాకు సమస్యలూ, బాధలూ ఏమున్నాయండీ!" తడబాటుగా అంది సుచరిత. చివ్వున నీళ్ళుటికిన కళ్ళు శ్రుతికి కనపడకుండా దాచుకోవడానికి వ్యర్థప్రయత్నం చేసింది. ఓదార్పుగా సుచరిత భుజాన్ని మృదువుగా తట్టింది శ్రుతి. దానితో వేడి తగిలిన వెన్నముద్దలా కరిగి, కరిగి కన్నీళ్ళు పొంగివచ్చాయి. ఎగసి వస్తున్న దుఃఖ సముద్రానికి వారధి వేస్తూ బేలగా చూసింది సుచరిత.

"నాకు కావలసింది అడిగి పొందలేని మూగతనం, దొరికినదానితో సరిపెట్టుకునే గుణం, నా తప్పు లేనప్పుడుకూడా తల వంచుకుని తిట్లు భరించే స్వభావం...'ఇలా వుండకూడదు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో నిలబడాలని అనుకుంటూనే లోలోపలికి కుంచించుకుపోవడం....ఒకే కప్పు క్రింద బ్రతుకుతున్నా మా యింట్లో అందరికి మానసికంగా దూరంగా, పరాయి వ్యక్తిగా పెరిగాను. నా ప్రవృత్తే నాకు ప్రధాన శత్రువయి నేను కోరుకున్నదేదీ పొందలేకపోయాను. అవకాశం అంతంతమాత్రంగా వున్నప్పుడు నాన్నగారికి చదివించే స్తోమత అంతగా లేనప్పుడు అక్క దెబ్బలాడి, అలిగి, సాధించి యూనివర్సిటీ చదువు పూర్తి చేసి మంచి ఫర్మ్‌లో జాబ్



సంపాదించుకుంది. అక్క చేతికి అంది వచ్చి నన్ను పైచదువు చదివించగల స్తోమత వున్నప్పుడు "యింక చదివింది చాల్లే ఏదో ఒక ఉద్యోగం చూసుకుందువుగాని" అన్న నాన్నగారితో "యింకా చదువుకుంటానండీ" అని నోరు విప్పి చెప్పలేకపోయాను. చిన్న ప్రైవేట్ కంపెనీలో జాబ్‌లో చేరాను. నేనందుకోలేని అవకాశాన్ని నా తరువాత వాళ్ళు చెల్లి, తమ్ముడు అంది పుచ్చుకుని చెల్లి మెడిసిన్‌లో, తమ్ముడు ఇంజనీరింగ్‌లో చేరారు—" సుచరిత కళ్ళల్లో నీరింకిపోయి శూన్యంలోకి చూస్తోంది. ఎప్పుడూ అతి గంభీరంగా అవసరమైన నాలుగు ముక్కలు మాట్లాడి వెళ్ళిపోయే అమ్మాయి మొట్టమొదటిసారి మనసు విప్పి తన సమస్యను వ్యక్తంచేస్తూంటే సానుభూతిగా వింటూంది శ్రుతి.

"క్రమేపీ మా యింట్లో అందరికీ నేనంటే చిన్న చూపు బలపడింది. అక్కలా దూసుకువెళ్ళినా అంతట నేను మంచి జాబ్ సంపాదించుకునేదారవలేదు. చలాకీ కబుర్లతో, ఉత్సాహంతో పరవళ్ళు త్రొక్కుతూ భర్తను సంపాదించుకునే చాకచక్యం లేదు. చెల్లిలా, తమ్ముడిలా పెద్ద చదువు చదివే తెలివితేటలు లేవు. చెప్పుకోదగని చిన్న ఉద్యోగాన్ని వెలగబెడుతున్న నేను ఇంట్లో ప్రతి ఒక్కరూ ఆర్డర్ చేసి పనిచేయించుకునే యంత్రంలా మారాను" ఎన్నాళ్ళుగానో అణచివుంచిన వ్యధ ఒక్కసారిగా పొంగివచ్చి నిగ్రహించుకోలేక సతమతమవుతూంది సుచరిత.

"అందుకూ నేను బాధపడలేదు. నాకు వీలున్నంతవరకు అమ్మకు యింటిపనుల్లో సాయం. మిగతావాళ్ళే పనిచెప్తే ఆ పనిని కిమ్మనకుండా చేస్తూనే వున్నాను. కాని ... ఈమధ్య మరో కొత్త సమస్య తలెత్తింది. ప్రైవేట్ ఫర్మ్‌లో పనిచేస్తూ వుండడంవల్ల ఏవైనా అర్జంట్ పనులుంటే సాయంకాలం ఆలస్యంగా రావడం జరుగుతుంది. ఆఫీసులో చాకిరి చేసి చేసి మళ్ళీ ఇంట్లో పని కూడా చెయ్యడానికి నాకు శక్తి వుండడం లేదు. దాంతో ఇంట్లో వాళ్ళంతా ముష్టి మూడొందల ఉద్యోగాన్ని మాని పారేసి ఇంట్లో కూర్చోమని నా ప్రాణం తీస్తున్నారు?"

"ఏం చేశావు? మానేశావా ఉద్యోగాన్ని?" ఆదుర్దాగా అడిగింది శ్రుతి.

"లేదు. జీవితంలో మొట్టమొదటిసారి ఎదురు తిరిగాను. నిజానికి వాళ్ళకూ నేను జాబ్ మానెయ్యడం యిష్టంలేదు. నేను సంపాదించే ముష్టి మూడొందలే యింట్లో ఎన్నో ఖర్చుల్ని ఆదుకుంటున్నాయి. ఆ మూడొందలూ కలవకపోతే బండి యింత సాఫీగా నడవదు. అది వాళ్ళకూ తెలుసు. నేను జాబ్ చేస్తే తీరాలి. కాని వాళ్ళ యిష్టాలకు, ఆజ్ఞలకు బద్ధురాల్నై [illegible] యింటెడు చాకిరీ చేస్తూ మరీ జాబ్ చెయ్యాలి. క్రమేపీ నేను బ్రతుకుతున్న బ్రతుకు యెంతో యిరుగ్గా ఊపిరాడనట్లుగా వుంది. నేను స్వేచ్ఛగా గుండెల్నిండా గాలి పీల్చుకోవాలంటే, నాకున్న ఈ చిన్ని ఆధారాన్ని పోగొట్టుకో కూడదు. అందుకే యెదురు తిరుగుతున్నాను. అంతలోనే తిరుగుబాటు. మళ్ళీ అంతలోనే నా వాళ్ళేకదా అన్న భావనతో రాజీ.... కాని....నలుగురు బిడ్డల్ని నాలుగు కళ్ళుగా చూసుకోవలసిన కన్న తల్లిదండ్రులే పక్షపాతం చూపిస్తూంటే, బ్రతక నేర్వని బిడ్డను కడుపులో పెట్టుకుని కాపాడవలసిన అమ్మే అనుక్షణం సాధిస్తూంటే .... తట్టుకోలేక పోతున్నాను. నేనింత దురదృష్టవంతురాల్నా అని సెల్ఫ్ పిటీతో క్రుంగిపోతున్నాను." సుచరిత కంఠం వణికింది.

అలనాటి-చరిత్రలు-ఈనాటి మేటి నవలలు



శ్రీ ప్రసాద్ రచనలు
(విజయ సీరియల్స్)



విజయనగర పతనం-1 — 13.00
విజయ నగర పతనం-2 — 12.00
షాజహాన్ — 13.00
సామ్రాట్ శ్రీరంగరాయ — 10.00
లకుమాదేవి(లల్లాదేవి రచన ఆంధ్రభూమి సీరియల్)- 15.00
ఆర్య చాణక్య — 13.50
అప్పాజీ — 12.00
యుగంధర్ — 13.50
రోషనార — 10.00



* అన్ని బుక్ షాపుల్లోనూ దొరుకుతాయి. దొరక్కపోతే కోరిన పుస్తకాల విలువలో ఒక రూపాయి తగ్గించి M.O. పంపితే మిగిలిన మొత్తానికి V.P.లు పంపుతాము!

నవజ్యోతి పబ్లికేషన్స్

నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరురోడ్
విజయవాడ-520 002